అభి'వంద'నలు..!

జిఎస్ఎల్వి-ఎఫ్ రాకెట్ ప్రయోగం సక్సెస్
సూర్యోదయం వేళ.. చలిని సైతం లెక్కచేయక
షార్‌లో విద్యార్థులతో కలెక్టర్ సందడి

విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

'బుధవారం తెల్లవారుజామున ఉషోదయం ముందా... ఉపగ్రహం ముందా' అన్నట్లుగా సూరీడు, రాకెట్ ప్రయోగం పోటీ పడ్డాయి.. బుధవారం ఉదయం 6.23 గంటలకు రోదసిలోకి సక్సెస్ ఫుల్‌గా జిఎస్ఎల్వి-ఎఫ్ 15 రాకెట్ ద్వారా ఎన్‌విఎస్-2 ఉపగ్రహం విజయవంతంగా అంతరిక్షంలోకి దూసుకెళ్లింది.

అంబరాన్నంటిన సంబరాలు

జిఎస్ఎల్వి-ఎఫ్15 రాకెట్ ప్రయోగాన్ని సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభచూపిన సూళ్లూరుపేట ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు వీక్షించారు. దాదాపు 500 మంది గ్యాలరీ నుంచి వీక్షించే ఏర్పాటు చేశారు. అలాగే తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దంపతులు సైన్స్ ఫెయిర్‌లో అద్భుత ప్రతిభ చూపిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎస్‌కె ఆఫ్రీద్‌ను, పదో తరగతి విద్యార్థిని ఎస్.హిమహన్షినిని ఇస్రో రాకెట్ ప్రయోగ వీక్షణకు తమతోపాటు తీసుకెళ్లారు. కలెక్టర్ ఇస్రో బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. వారితో కలిసి ఫొటోల్లో పాలుపంచుకున్నారు. భారతకీర్తిని ప్రపంచపటంలో ఉన్నత స్థానంలో నిలుపుతున్న ఇస్రో బృందాన్ని కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఉన్నారు.

చలిని సైతం లెక్కచేయని వీక్షకులు

బుధవారం ఉదయం 6.23 గంటలకు జిఎస్ఎల్వి-ఎఫ్15 నిప్పులు చిమ్ముకుంటూ ఆకాశంలోకి తారాజువ్వలా దూసుకెళ్లింది. ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు దేశ నలుమూలల నుంచి చిన్నపెద్ద తేడా లేకుండా తెల్లవారుజామున చలిని సైతం లెక్కచేయకుండా శ్రీహరికోటలో ఏర్పాటు చేసిన గ్యాలరీకి చేరుకున్నారు. జాతీయ జెండాలు చేబూని 'జయహో భారత్' అంటూ నినాదాలు చేశారు. రాకెట్ ఘన విజయంతోవ ఆరి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది.

'ఛీ'టింగ్ అధికారులు

రేణిగుంటలో వెలుగు చూసిన భారీ భూదందా
బోగస్ పట్టాలకు రూ.2 కోట్లకు పైగా వసూళ్లు
డిప్యూటీ తహశీల్దార్ సహా నలుగురిపై ఛీటింగ్ కేసు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'కంచె చేను మేసిన చందాన' బోగస్ పట్టాల కేసులు అధికారులే సూత్రధారులు.. తహశీల్దార్ సంతకాన్ని డిప్యూటీ తహశీల్దార్ ప్రేమ్‌కుమార్, విఆర్ఒ తనిష్క, కంప్యూటర్ ఆపరేటర్ శశికళ సాయంతో ఫోర్జరీ చేయడమే గాకుండా, బోగస్ పట్టాలకు రూ.2-3 కోట్లకు పైగా వసూలు చేశారు. వీరిపై రేణిగుంట పోలీసు స్టేషన్‌లో 468, 420, 470 సెక్షన్ల కింద కేసు నమోదయ్యింది. జగనన్న ఇంటి పట్టాల కేటాయింపు పేరుతో పేద ప్రజలను మోసం చేస్తూ భారీ భూదందాకు తెరలేపారు.

రేణిగుంటలో 2022లో డిప్యూటీ తహశీల్దార్‌గా ప్రేమ్‌కుమార్, విఆర్ఒ తనిష్క, కంప్యూటర్ ఆపరేటర్‌గా శశికళ పనిచేశారు. అప్పట్లో జగనన్న ఇంటి స్థలాలకు బాగా డిమాండ్ ఉండడంతో, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న ఈ ముగ్గురు అధికారులు మధ్యవర్తిగా కరకంబాడికి చెందిన సుబ్రమణ్యంను వాడుకున్నారు. అతని ద్వారా ఇళ్లపట్టాలు అవసరమైన వారిని రేణిగుంట తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించుకుని, బేరం పెట్టి ఇంటి స్థలాలు అమ్మడానికి ప్రణాళిక రచించారు. అన్నాసాంపల్లి, కరకంబాడి, కురుకాల్వ తదితర రెవెన్యూ గ్రామాల్లో ఇళ్లస్థలాలు చూపించి కావాలంటే ఒక్కో స్థలానికి 2 లక్షలు ఆఫర్ చేశారు. ఒక్కో ఇంటి పట్టా లక్షా 80వేలకు ఒప్పందం కుదుర్చుకుని, వారి నుంచి డబ్బు రాబట్టుకుని దాదాపు 80-100 పట్టాలను గుత్తగా అమ్మేశారు. అయితే ఈ తతంగం అంతా ఆన్‌లైన్ రికార్డులో నమోదు కాకపోవడంతో బాధితులు ఎవరూ ఈ విషయాన్ని గుర్తించలేదు.

తిరుపతి అర్బన్ మండలం జీవకోన సత్యనారాయణపురంలో నివాసం ఉండు బుజ్జమ్మ, అహ్మద్, మల్లేశావల్లి, చెంచయ్య పేరుతో మంజూరు చేసిన పట్టాలు బోగస్ అని రేణిగుంట పోలీసులు గుర్తించారు. దాదాపు రెండేళ్లపాటు తమకు అన్యాయం చేసిన అధికారులు న్యాయం చేస్తారని ఎదురు చూసిన బాధితులు, వారి నుంచి న్యాయం జరగదని గ్రహించి చివరకు మంగళవారం రేణిగుంట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదుచేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ చుట్టూ గత రెండేళ్లుగా తిరిగామని, వాళ్లు ఇళ్లస్థలాలు చూపించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు కొందరు రేణిగుంట పోలీసులను ఆశ్రయించారు. డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఒ, కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు కరకంబాడికి చెందిన మధ్యవర్తి సుబ్రమణ్యంపై ఫోర్జరీ ఛీటింగ్ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరి ఛీటింగ్‌కు నలుగురు మాత్రమే బయటకు వచ్చారు. త్వరలోనే విషయం తెలుసుకున్న మరికొంతమంది రేణిగుంట పోలీసు స్టేషన్‌కు వచ్చే అవకాశం లేకపోలేదు. వీరిపై ఎఫ్ఐఆర్ నంబర్ 19/2025గా కేసు నమోదయ్యింది. ప్రేమ్‌కుమార్, తనిష్క ప్రస్తుతం శ్రీకాళహస్తిలో పనిచేస్తున్నారు. తమపై కేసు నమోదయ్యిందని తెలుసుకున్న వీరు పోలీసులకు దొరక్కుండా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. బోగస్ పట్టాల పేరుతో తమను నిలువునా ముంచిన ప్రేమ్‌కుమార, తనిష్క, శశికళ, సుబ్రమణ్యంలను అరెస్టు చేసి, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా రిమాండ్‌కు తరలించాలని జిల్లా పోలీసు అధికారులకు విన్నవిస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులుగా అక్బర్, రవి

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీతో రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - క్యాంపస్

భారత విద్యార్థి ఫెడరేషన్ తిరుపతి జిల్లా మహాసభ రెండో రోజు 21 మందితో జిల్లా కమిటీ ఎన్నికయ్యిందని రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ వెల్లడించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భగత్‌రవి, జిల్లా అధ్యక్షులుగా అక్బర్, ఉపాధ్యక్షులుగా అశోక్, వినోద్, తేజ, సహాయ కార్యదర్శులుగా ప్రవల్లిక, బాల, ఉమేష్, గుటువయ్య తదితరులతో 21 మందితో నూతన కమిటీ ఎన్నికయ్యింది. రాష్ట్రాల హక్కులను హరించే యుజీసీ ముసాయిదాను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని, ఉమ్మడి ప్రవేశ పరీక్షల విధానాన్ని రద్దు చేసి, ఆయా యూనివర్సిటీల ప్రవేశ పరీక్షల విధానాన్ని కొనసాగించాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి కాపాడాలని, పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులకు నాన్‌నెట్ ఫెలోషిప్ 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుపతి, చంద్రగిరిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రారంభించాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు.

పల్లెల్లో వరి 'కోతల జాతర'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తూర్పు మండలాల్లోని పల్లెల్లో వరి కోతల జాతర మొదలైంది. రబీలో వేసిన వరి పంటలు కోతకు రావడంతో రైతులు పెద్ద ఎత్తున ఒబ్బిళ్లు చేస్తున్నారు. సాధారణంగా తూర్పు మండలాల్లో మార్చి, ఏప్రిల్ మాసాల్లో వరి పంటలు కోతకు వస్తుంటాయి. అయితే ఈ సారి రైతులు రబీ ప్రారంభ దశలోనే నాట్లు వేయడంతో జనవరిలోనే కోతకు వచ్చిన పరిస్థితి. అయితే జనవరిలో బంగాళాఖాతంలో చోటు చేసుకున్న వరుస అల్ప పీడనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి కోతలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాక వరి పొలాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో రైతులు కోతలకు ఉపక్రమించారు. ఒక్కో ఆయకట్టు పరిధిలో ఐదు అంతకుమించి వరికోత యంత్రాలు కోతలకు దిగడంతో జాతరను తలపిస్తోంది.

సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

రామచంద్రాపురం (చంద్రగిరి): నెల్లూరులో ఫిబ్రవరి 1-3 తేదీల్లో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు జయచంద్ర విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి ప్రభుత్వ హైస్కూలు వద్ద ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యుగంధర్, చిట్టిబాబు, ప్రకాష్, మధు, చిరంజీవి, రామ్మూర్తి పాల్గొన్నారు.

'రోటరీ' కృషితో తగ్గిన పోలియో కేసులు

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రోటరీ క్లబ్ కృషి వలన ప్రపంచ వ్యాప్తంగా పోలియో కేసుల సంఖ్య 99 శాతం తగ్గాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక శిల్పారామంలో రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జ్ఞాన క్రియ సమ్మేళనం, 41వ జిల్లా సమావేశం బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ రోటరీక్లబ్ కు సంబందించిన ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్ర సభ్యులందరికీ శుబాకాంక్షలు తెలిపారు. రోటరీ క్లబ్ కృషి వలన దేశ, ప్రపంచ వ్యాప్తంగా 99 శాతం పోలియో కేసులు తగ్గాయని, వారు చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన వ్యక్తి రోటరీ జిల్లా గవర్నర్ గా ఎన్నికైన సాదు గోపాల కృష్ణకు శుబాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్ : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే తమపై భూకబ్జా ఆరోపణలు చేస్తున్నారని, అటవీ భూమి కబ్జా అంటూ ఎల్లో మీడియాలో పచ్చి అబద్దాలు ప్రచురించారని, ఒక్క ఎకరా అయినా కబ్జా చేసినట్లు నిరూపించగలరా? అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. తిరుపతి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పులిచర్ల మండలంలో అటవీ భూములను కబ్జా చేశామంటూ చంద్రబాబుకు అంటకాగే ఎల్లో మీడియాలో ప్రచురించిన కథనం పూర్తి అవాస్తవమని ఖండించారు. చట్టబద్ధంగా 2001లో కొనుగోలు చేసిన భూములపై నిస్సిగ్గుగా పచ్చి అబద్దాలతో కూడిన కథనాలను ప్రచురించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసిపి నేతలపై కక్షసాధింపు ప్రారంభించారన్నారు. తనపై తప్పుడు కథనాలను ప్రచురించిన పత్రికపై రూ.50 లక్షలకు నష్టపరిహారం కేసు వేయనున్నట్లు చెప్పారు.

త్వరలో బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ పర్యటన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

త్వరలో బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ పర్యటన దేశ వ్యాప్తంగా నిర్వహించినట్లు ఎఫ్డిసిఐ చైర్మన్ సునీల్ సేది తెలిపారు. ఈ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ లో భాగంగా అంతర్జాతీయంగా ఆహ్లాదాన్ని కలిగించే ఫ్యాషన్, మ్యూజిక్ తో వినోదాన్ని అందించే గొప్ప ప్రదర్శనలు చేపడతామన్నారు. ఫ్యాషన్ డిజైన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్డిసిఐ)తో మరోసారి చేతులు కలిపి ఈ ఫ్యాషన్ టూర్ నిర్వహిస్తున్నమన్నారు. దేశంలో ఫ్యాషన్, బాలీవుడ్, మీడియా, వ్యాపార రంగాలకు చెందిన 70 మందికి పైగా ప్రముఖ వ్యక్తులతో కలిసి తన కళాత్మక ప్రతిభను గుర్తు చేసుకునే అద్భుతమైన సంబరంతో ఇది గురుగ్రామ్ లో ప్రారంభమవుతుంది. ముంబయి, చండీఘర్, గౌహతి, వైజాగ్ వంటి పట్టణ నగరాలకు తమ ఆకర్షణీయమైన ప్రపంచాన్ని తీసుకువెళ్తూ, ఈ పర్యటన ప్రతి గమ్యస్థానాన్ని ఫ్యాషన్ భవిష్యత్తుకు అంతిమ ప్రమాణాన్ని నిర్దేశించే ఒక కొత్త మైలురాయిగా మారుస్తుందన్నారు. పెర్నాడ్ రికార్డ్ ఇండియ ఛీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ కార్తీక్ మొహింద్రా మాట్లాడుతూ "బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ ఎఫ్ డిసిఐ సహకారంతో ఫ్యాషన్ డిజైనర్, సెలబ్రిటీ లతో కలిసి నిర్వహిస్తున్నామన్నారు. సరికొత్త ఫ్యాషన్ తో ఆహ్లాదాన్ని కలిగించే సంగీతాన్ని, యువతరాన్ని ఆకట్టుకునేలా నిర్వహించే ఈ ప్రదర్శనలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంస్థ ప్రతినిధి ఆషిష్ సోనీ తదితరులు పాల్గొన్నారు.

సోషల్‌మీడియా ప్రతినిధులపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరుమల

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుకు తిరుమలలో అవమానం జరిగిందంటూ ప్రచారం చేసిన సోషల్ మీడియా ప్రతినిధులపై పోలీసు స్టేషన్‌లో టిటిడి ఫిర్యాదు చేసింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డయల్‌న్యూస్, పోస్ట్ 360, జర్నలిస్టు వైఎస్ఆర్ నిర్వాహకులపై తిరుపతి యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నంబర్ 13/2025గా నమోదయ్యింది. చాగంటి కోటేశ్వరరావు తిరుమల పర్యటనపై వాస్తవ సమాచారాన్ని పోషల్ మీడియా ద్వారా టిటిడి వెల్లడించినా సదరు సోషల్ మీడియా ప్రతినిధులు టిటిడి ప్రతిష్టను దెబ్బతీసేలా వాస్తవాలను వక్రీకరించి దురుద్దేశంతో అవాస్తవాలను ప్రచారం చేశారని టిటిడి పేర్కొంది. న్యూఢిల్లీ, విజయవాడలోని పిఐబి (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో)కు, సోషల్ మీడియా సంస్థల లైసెన్స్‌లను రద్దు చేయాలని యూట్యూబ్ మేటా మేనేజ్‌మెంట్‌కూ ఫిర్యాదు చేసింది.

వాస్తవానికి డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు జనవరి 14న శ్రీవారి దర్శనం, 16న మహతి ఆడిటోరియంలో ప్రవచనాలు ఇచ్చేందుకు డిసెంబర్ 20న టిటిడి ప్రొసీడింగ్స్ ఇచ్చింది. వారికి ఉన్న క్యాబినెట్ ర్యాంకు ప్రోటోకాల్ ప్రివిలేజ్ ప్రకారం 14న శ్రీవారి దర్శనం ఏర్పాట్లను చేసింది. రాంబగీచా గెస్ట్‌హౌస్ నుంచి శ్రీవారి ఆలయానికి తీసుకెళ్లేందుకు బ్యాటరీ వాహనాలను, శ్రీవారి ఆలయానికి బయోమెట్రిక్ ద్వారా అనుమతించేందుకు టిటిడి ఏర్పాట్లను చేసింది. అయితే ఏర్పాట్లను ఆయన సున్నితంగా తిరస్కరించి, సామాన్య భక్తుల తరహాలోనే వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచరి శ్రీవారి ఆలయానికి చేరుకుంటానని స్వయంగా చెప్పారు. జనవరి 8న తిరుపతిలో జరిగిన తోపులాట ఘటన నేపథ్యంలో చాగంటి ప్రవచన కార్యక్రమాన్ని వాయిదా వేస్తే బాగుంటుందని వారి దృష్టికి టిటిడి ఉన్నతాధికారులు తీసుకెళ్లగా వారు అంగీకరించారు. తదుపరి ప్రవచనాల తేదీలను మరోసారి వెల్లడిస్తామని టిటిడి పేర్కొంది. వాస్తవం ఇలా ఉండగా బయోమెట్రిక్ ద్వారా కాకుండా వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచరి శ్రీవారి ఆలయంలోకి అనుమతించారని, చివరి నిమిషంలో ప్రవచనాల కార్యక్రమాన్ని టిటిడి రద్దుచేసినట్లు అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసినట్లుగా ఫిర్యాదులో టిటిడి పేర్కొంది.

ఇంటి స్థలాలివ్వాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - రేణిగుంట

జంగారెడ్డిపల్లిలో గిరిజన ఇళ్లు కూల్చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యామ్నాయంగా మూడు సెంట్లు ఇంటి స్థలం, ప్రభుత్వ హౌసింగ్ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రేణిగుంట తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండల తాసిల్దార్‌తో గిరిజన సంఘం నాయకులు చర్చలు జరిపారు. అనంతరం ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ...రేణిగుంట మండలం కరకంబాడి రెవిన్యూ లెక్కదాఖలా సర్వేనెంబర్ 535లో గత ప్రభుత్వం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు సర్వే చేసి గిరిజన తెగకు చెందిన 60 మంది ఎరుకుల కులస్తులకు ఫ్లాట్లు వేసి స్థలాలు కేటాయించారన్నారు. అందులో 2 లక్షలు నుండి 3 లక్షల పైగా అప్పుచేసి ఇండ్లు నిర్మించుకొని ఇంటి పన్నులు వగైరాలు కలిగిన చెంగారెడ్డిపల్లి ఏకలవ్య ఏరుకుల కాలనీ ఇళ్లను అర్ధరాత్రి మండల తాసిల్దార్ నాయకత్వంలో పోలీసు బలగాలతో జెసిబి బుల్డోజర్ ద్వారా అక్రమంగా కూల్చేసిన గిరిజన ఇండ్లకు ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో నాయకులు ఈశ్వరమ్మ, కరీముల్లా పాల్గొన్నారు.

బోర్లు, మోటార్లు మరమ్మతు చేయండి : కమిషనర్

తిరుపతి టౌన్ : నగరపాలక సంస్థ పరిధిలో తాగునీరు అందించే బోర్లు, మోటార్లను మరమ్మతు చేసి ప్రజలకు సమృద్ధిగా నీరు అందించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. 48, 49 వార్డుల్లో పర్యటించగా పలుచోట్ల నీరు రావడం లేదని, పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ప్రజలు కోరారు. రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇచ్చేలా, బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి, పారిశుధ్యం, పన్నుల వసూళ్లు, తదితర అంశాలపై వివిధ శాఖ విభాగాధిపతులతో నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అలాగే అన్ని సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. పెండింగ్ లో ఉన్న అన్ని రకాల పన్నులను సకాలంలో వసూలు చేసి నగర్ అభివృద్ధికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

అధికారికంగా సెల్‌ఫోన్ కౌంటర్లో.. అనధికారికంగా పంచెల అమ్మకం

సెల్ ఫోన్ కౌంటర్లో 'పంచెలు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని సెల్ ఫోన్ కౌంటర్లలో కొందరు పంచెల వ్యాపారం చేస్తున్నారు. రాహు-కేతు పూజల కోసం ఆలయానికి వచ్చే భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి పూజల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఇదే అవకాశంగా కొందరు సెల్ ఫోన్ కౌంటర్లలో పనిచేసే సిబ్బంది పంచెలు, టవళ్ళ వ్యాపారం మొదలు పెట్టేశారు. రూ.300 నుంచి రూ.400 చొప్పున భక్తులకు విక్రయిస్తున్నారు. సెల్ ఫోన్ కౌంటర్లలో సిబ్బంది పంచెల వ్యాపారం చేస్తుంటే ఆలయ తనిఖీ అధికారులు ఏం చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్ఓ ప్లాంట్, ల్యాబ్ పరికరాల వితరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ మంగళం ట్రెండ్స్ కు ఐడిబిఐ బ్యాంక్ తిరుపతి శాఖ విద్యార్థుల సంక్షేమం, విద్యా మౌలిక సదుపాయాలను మెరుగుపరచుకోవడం కోసం ఆర్వో ప్లాంట్, ల్యాబ్ పరికరాలను వితరణగా అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవుల నాయుడు తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా విద్యార్థులకు రూ.80 వేలతో ఆర్వో ప్లాంట్, రూ.70 వేలతో సైన్స్ ప్రయోగాల నిర్వహణ కోసం ల్యాబ్ పరికరాలను సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ శ్రీకాళహస్తి బ్రాంచ్ హెడ్ సూర్య ప్రకాష్, తెలుగు ఉపాధ్యాయులు కిట్టన్న, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

అపాచీ బాధితులకు పరిహారమిప్పించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అపాచీ పరిశ్రమ కారణంగా భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం అందేలా చొరవచూపాలంటూ శ్రీకాళహస్తి మండలం వాంపల్లికి చెందిన రైతులు బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కోటా వినుతకు విజ్ఞప్తి చేశారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో వాంపల్లి వద్ద అపాచీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు 20 మంది రైతుల నుంచి భూములు తీసుకున్నారని చెప్పారు. అయితే ఐదేళ్లు గడిచిపోతున్న ఇంతవరకు భూములు కోల్పోయిన తమకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. స్పందించిన వినుత తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

శ్మశానానికి దారి చూపాలని వినతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

మండలంలోని గోవర్ధనగిరి దళితవాడ స్మశానానికి దారి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు తహశీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ దశాబ్దాలుగా స్మశానానికి దారి లేదని, ప్రస్తుతం ఉపయోగిస్తున్న దారి గుడిమాన్యమని, వేరే బాటలో వెళ్లాలని సర్పంచి శివకృష్ణమనాయుడు దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని, సమాధులు సైతం పెకలించి సర్వే హద్దురాళ్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈ రోడ్డు పనులు చేపట్టామని తెలిపారు. తహశీల్దార్ స్పందిస్తూ రెవెన్యూ రికార్డులు పరిశీలించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

గూడూరు టౌన్ : అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.ఇంద్రావతి, బిఎస్ ప్రభావతి డిమాండ్‌చేశారు. సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, గ్రేడ్ 3, 4 ప్రభుత్వ ఉద్యోగులుగా వర్కర్లను, హెల్పర్లను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు బి.మంగమ్మ, జె.లక్ష్మి పాల్గొన్నారు.

వేమూరులో సుభాష్ పాలేకర్ సందర్శన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రూరల్ వేమూరు గ్రామాన్ని పద్మశ్రీ సుభాష్ పాలేకర్ సందర్శించారు. తిరుపతి భూలక్ష్మి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులకు సుభాష్‌పాలేకర్ కృషి, విషరహిత వ్యవసాయ ఉత్పత్తులు పండించడంపై వివరించారు. తీసుకునే ఆహారం ఔషధం కావాలంటే ఎస్‌పికె విధానాలను ప్రతి ఒక్క రూతు అనుసరించాలని సూచించారు. ప్రకృతికి అనుకూలంగా పంటలు పండించుకుని, అలాంటి ఉత్పత్తులనే వినియోగించాలన్నారు. పెరటి, మిద్దెతోటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధరం, మాస్టర్ రాంజీ, ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతు అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

'వినియోగదారుడే రారాజు' క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి టౌన్ : కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో 'జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం' ఆధ్వర్యంలో 'వినియోగదారుడే రారాజు' అనే నినాదంతో ప్రచురించిన క్యాలెండర్‌ను జేసీ శుభం బన్సల్ ఆవిష్కరించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2019 చాలా విశిష్టమైనదని, ప్రజలు మోసపోకుండా, నష్టపోకుండా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పి.రాజారెడ్డి, విశ్వం సంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, దేవేంద్ర, చంద్రిక పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్లు తనిఖీ

రేణిగుంట : ప్రతి నెలా నిర్వహించే తనిఖీలో భాగంగా రేణిగుంట వద్ద గల ఈవీమ్స్, వివిప్యాట్‌లను భద్రపరిచే గోడౌన్‌లను కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. జివిఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి సుధారాణి, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

గుంతలు..గుండెల్లో గుబులు!

- ప్రయాణికులకు తప్పని పాట్లు - నిద్రావస్థలో అధికారులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: 'గుంతలు లేని రోడ్లను తయారు చేస్తాం..' అని ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే పనులకు ఏ మాత్రం పొంతన లేకుండా పోతోంది. తడ- శ్రీకాళహస్తి రహదారి గత వర్షాలకు పూర్తిగా గుంతలమయమైంది. ఈ రోడ్డుపై నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నా ఇటు అధికారులు, అటు పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది.

తడ- శ్రీకాళహస్తి రోడ్డు గుంతలమయం

ఇటీవల కురిసిన వర్షాలకు తడ- శ్రీకాళహస్తి రహదారి గుంతల మయమైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహన దారులకు ఆందోళన కలిగిస్తోంది. రహదారులు బాగుంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది. వర్షానికి రోడ్డు బాగా కంకర తేలి అధ్వానంగా మారాయి. దీంతో వాహన దారులకు తిప్పలు తప్పడం లేదు. గుంతలు పడి కంకర తేలి దుస్థితికి చేరిన రోడ్డు మరమ్మతుకు నోచుకోకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయం

సత్యవేడు నియోజక వర్గంలో శ్రీ సిటీలో అనేక పరిశ్రమలు వున్నాయి. బతుకు తెరువు కోసం ఆ పరిశ్రమలలో అనేక మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. యువకులు రాత్రి వేళల్లో సైతం ద్విచక్ర వాహనాలపై విధులకు వెళ్లి వస్తుంటారు. రాత్రి సమయంలో ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుండి శ్రీ సిటీకి అధిక సంఖ్యలో భారీ వాహనాలు రకరకాల సామగ్రితో వచ్చి వెళుతుంటాయి. రాక పోకలు పరిశ్రమలో తయారైన వివిధ రకాల సామగ్రి తడ నుండి శ్రీకాళహస్తి మీదుగా బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు సంఖ్య అధికమైంది. పరిశ్రమలకి ముడిసరుకు తోపాటు వారు తయారుచేసే పలు రకాల వస్తువులు భారీ వాహనాల్లో అధికలోడ్‌తో వెళుతుంటాయి. భారీ వాహనాల రాక పోకలతో రోడ్డు ధ్వంసమైంది. రోడ్డు గుంతలమయం కావడంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ పరిశ్రమలకు కార్మికులు తీసుకెళ్లే ప్రైవేటు బస్సులు షిఫ్ట్ ప్రకారం కార్మికులతో ప్రయాణిస్తుంటాయి. కార్మికులతో వెళ్లే బస్సులు కార్మికుల గుండెల్లో గుబులు కలిగిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్లలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. నిత్యం ఈ రహదారి మీదుగా వందలాది మంది వాహన దారులు వెళుతుంటారు. రోడ్డుపై గుంతలు తప్పించే ప్రయత్నంలో చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. మరి కొందరు ప్రాణాలు సైతం పోగొట్టుకున్న సందర్భాలు, సంఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా అధికారులను నిద్రావస్థ వీడలేదు. వాహన చోదకుల భద్రత తమకేమీ పట్టదు అన్నట్లు రోడ్డు భవనాల శాఖ వ్యవహరిస్తుండడంతో రోడ్డు మరమ్మతులు పట్టించు కునేవారే కరువయ్యారు. ధ్వంసమైన రోడ్డును బాగుచేసి ప్రయాణికులు, కార్మికులు ప్రమాదాలకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

గుంతలమయమైన రోడ్డు

అయ్యో పాపం చిన్నారి!

- వాగులో పడి మృతి
- అపహరణకు గురైన కేసు నమోదు
- చివరకు వీడిన మిస్టరీ

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): వాగులో పడి ఓ చిన్నారి మృతి చెందాడు. అయితే అంతకు ముందు వారి తల్లిదండ్రులు తమ చిన్నారి అపహరణకు గురయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. చివరకు వాగులో చిన్నారి మృతదేహం లభించడంతో చిన్నారి అపహరణ కేసు మిస్టరీ వీడింది. పోలీసుల కథనం మేరకు.. చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ పాతపేట గ్రామానికి చెందిన తేజస్ (3) బాలుడు వాగులో పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం చిన్నారి తేజస్ ఇంటి ఎదుట ఆడుకుంటూ కనిపించక పోవడంతో తల్లిదండ్రులు లోకేష్ ఆచారి, శరణ్యలు తమ బిడ్డను ఎవరో అపహరించారని అనుమానంతో బుధవారం ఉదయం 11 గంటలకు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి గాదంకి టోల్ ప్లాజా వద్ద సిఐ సుబ్బరామిరెడ్డి, ఎస్సై వై సుమన్లు సిసి ఫోటోస్ పరిశీలించి, అనుమానితులైన పాత సామాన్ల కొనుగోలు చేసే వ్యాపారులను విచారించారు. వారికి సంబంధం లేకపోవడంతో విడిచిపెట్టారు. లోకేష్ ఆచారి, శరణ్య లకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. తై అమావాస్య సందర్భంగా చిన్నారి తండ్రి లోకేష్ ఆచారి తన తండ్రి సమాధికి పూజలు చేసేం దుకు బయలుదేరాడు. తల్లి శరణ్య స్నానానికి వెళ్లింది. చివరివాడైన చిన్నారి తేజ వీధిలో ఆడుకుంటూ కొంత సమయం తర్వాత తన తండ్రి వెళ్లిన దారిలో తండ్రి కోసం వెనుకనే వెళ్లాడు. పాతపేటకు, రమణయ్య గారి పల్లికి మధ్య లో వాగు వుంది. ఆ వాగులో మూడు అడుగు ల మేర నీరు ప్రవాహి స్తోంది. ఆ వాగులో పడి చిన్నారి కొంత దూరం కొట్టుకు పోయి కంపచెట్లకు తగులు కొని మృతి చెందా డు. చిన్నారి కోసం పోలీసులు, తల్లిదండ్రులు గ్రామస్తులు వెతుకు తుండగా ఆ వీధిలో వున్న కొందరు 'తేజస్ వీధిలో ఆడుకుంటూ నీ వెనకాలే వచ్చాడు..' అంటూ గ్రామస్తులు తెలపండంతో. మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో వాగులో వెతికారు. చిన్నారి తేజస్ వాగులో మృతదేహమై ప్రత్యక్షమయ్యాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చిన్నారి మృత దేహంతో విలపిస్తున్న తల్లి శరణ్య
ఇన్ సెట్‌లో చిన్నారి తేజస్ (ఫైల్ ఫోటో)

గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-ఏర్పేడు : మేర్లపాక హరిజనవాడ బస్టాప్ వద్ద ఏర్పేడు సీఐ జయచంద్ర తన సిబ్బందితో కలసి అనుమానా స్పదంగా కనపడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని సోదా చేయగా ఇద్దరి వద్ద ప్లాస్టిక్ బ్యాగ్ లో 4.935 కేజీల గంజాయి వుండడం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఏపీలోని అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లి అక్కడ రైల్వే స్టేషన్ లోని గుర్తు తెలియని వ్యక్తుల నుండి గంజాయిని కొనుక్కుని వాటిని చిన్న చిన్న పొట్లాలల్లో కట్టి శ్రీకాళహస్తి, రేణిగుంట రైల్వే స్టేషలకు వెళ్లి చుట్టు పక్కల వారికి అమ్ముకుందామని ఆటో ఎక్కి ఏర్పేడు మండలంలోని మేర్లపాక హరిజనవాడ వైపు వచ్చారు. అక్కడి నుండి మరొక ఆటో కోసం వేచి ఉండగా ఏర్పేడు సీఐ పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నందుకు విశేష ప్రతిభ కనబరిచిన డిఎస్పి శ్రీనివాసరావు, ఏర్పేడు సిఐ జయచంద్ర, వారి సిబ్బందిని ఎస్పి హర్షవర్ధన్ రాజు అభినందించారు.

రీ సర్వే తనిఖీ

ప్రజాశక్తి -కోట : కోట మండలం అల్లంపాడు పంచాయతీలోని రైతుల పొలాల్లో నిర్వహిస్తున్న భూ రీ సర్వేను కోట తహశీల్దారు కటారి జయజయరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే ప్రక్రియ లో భాగంగా మండల సర్వేయర్లతో వాటి వివరాలను అడిగి తెలుసుకుని రీ సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. అంతే కాకుండా అక్కడికి వచ్చిన రైతులు పలు సమస్యలను తహశీల్దారు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పరిష్కారానికి చర్య లు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, గ్రామ సర్వేయర్ మహేష్, వీఆర్వోలు పి కృష్ణయ్య, ఏడుకొండలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొలాల్లో రీ సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దారు

ఉచిత పశు వైద్యశిబిరం

పాడి రైతులకు ఉచిత మందులు అందిస్తున్న అధికారి

ప్రజాశక్తి -కెవిబి పురం: పశువుల ఆరోగ్యం, ఉత్పాదకత పెంపునకే పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని కేవీబీపురం మండలం కోవనూరు పశు వైద్యాధికారి గుణ శేఖర్ పేర్కొన్నారు. కేవీబిపురం మండలంలోని ఎంపి రాజుల కండ్రిగ లో టిడిపి మండల అధ్యక్షుడు రామంజుల నాయు డు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి గురు శేఖర్ మాట్లాడుతూ పశువులకు సంక్రమిస్తున్న వ్యాధులు, ఎదకురాని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇదేగాక పశువుల్లో పునరుత్పత్తి పెరిగే అవకాశం ఉందన్నారు. గొర్రెలు, మేకలకు బొప్ప వ్యాధి నివారణ టీకాలు వేస్తామని తెలిపారు. పాడి పరిశ్రమకు ప్రభుత్వ పథకాలను ఉయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సిబ్బంది ప్రవీణ్ కుమార్, వెంకటేష్, గోపినాథ్ రెడ్డి సర్పంచ్ బాలాజీ నాగరాజ్, ఉప సర్పంచ్ గురునాథం, నాగూర్ మనీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సహకారంతో వడమాల పేట మండలం బట్టి కండ్రిగలో తిరుపతికి చెందిన వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఫౌండర్ కోనేటి రవిరాజు, అధ్యక్షులు బాబు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, రామచంద్ర రాజు, కే సుబ్రహ్మణ్యం రాజు, కే పద్మనాభం రాజు, వైస్ ప్రసిడెంట్ చంద్రబాబు, మునికృష్ణ, రమేష్ రాజు, హాస్పిటల్ సిబ్బంది, వంద మంది వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 25 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ క్యాక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రిని కలిసిన డాక్టర్ తిప్పారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల అధినేత డాక్టర్ ఆర్ తిప్పా రెడ్డి నగరం లోని ప్రముఖ హోటల్లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సామంచి శ్రీనివాసులను తిప్పారెడ్డి అభినం దించారు. వీరిద్దరూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు కావడం గర్వ కారణం అన్నారు. వీరిద్దరూ అనేక సంవత్సరాల నుండి ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడం హర్షించ దగ్గ విషయం అన్నారు.

రాష్ట్ర మంత్రిని అభినందిస్తున్న డాక్టర్ ఆర్ తిప్పారెడ్డి

ఆదిశంకరలో ముగిసిన సదస్సు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో స్టార్ట్ అప్ అండ్ ఇండస్ట్రీ రెడీ స్కిల్స్‌పై మూడు రోజుల పాటు నిర్వహించిన అవగాహన సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా సదస్సు కోఆర్డినేటర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా, ఇంజనీర్లుగా ఎదగడానికి ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంపొందిం చుకొని ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, ధనుంజయ, వేణుమాధవ్, రాజయ్య, ప్రణయ్ కుమార్, ఏవో రామయ్య పాల్గొన్నారు.

2న శ్రీ షిరిడీ సాయి బాబా కళ్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు బై పాస్ రోడ్డులోని తొరూరు సమీపంలోని ఆర్ అండ్ గెస్ట్ హౌస్ ఎదురుగా నూతనంగా నిర్మించిన షిరిడీ సాయి బాబా కళ్యాణ మండపం ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం ప్రారంభించనున్నట్లు శ్రీ షిరిడీ సాయి బాబా నిత్య అన్నదాన సాంఘిక సేవా సమాజం నిర్వాహుకులు తెలిపారు. భక్తులు, కళ్యాణమండపం నిర్మాణానికి నగదు, వస్తు రూపంలో సహాయం చేసిన విరాళాల దాతలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భూములు ఆక్రమణకు గురైతే సిబ్బందిపై వేటు

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి - జాతీయ రహదారి పెండింగ్ పనుల పరిశీలనలో ఆర్‌డివో రామ్మోహన్

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే సిబ్బందిపై వేటు తప్పదని, భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్‌డివో రామ్మోహన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి పనపాకం వద్ద భూ సేకరణ సమస్యతో వాయిదా పడిన స్థలాన్ని ఆర్‌డివో బుధవారం పరిశీలించారు. పనపాకం మెయిన్ రోడ్డు వద్ద చంద్రగిరి రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించి, స్థలాన్ని సర్వే చేయించారు. జాతీయ రహదారి పనులకు భూ సేకరణ లో రైతులకు కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ లు నష్టపరిహారం చెల్లించడంతో స్థల వివాద సమస్య పరిష్కారం అయిందన్నారు. 'ఆ స్థలంలో నివాస గృహాలను రైతులు ఖాళీ చేశారా లేదా? దేవాలయానికి జాతీయ రహదారి నిర్మాణానికి ఏమైనా ఇబ్బంది వస్తుందా?' అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణానికి ఎలాంటి సమస్యలు లేవని రెవెన్యూ అధికారులు సర్వే చేసి తెలపడంతో రెండు వారాలలో పెండింగ్‌లో వున్న జాతీయ రహదారి పనులను ప్రారంభిస్తామని ఆర్డీవో తెలిపారు. చంద్రగిరి రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 1513/8 సంబంధించిన 0. 47 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్న విషయంపై ఆర్డీవో రామ్మోహన్ స్పందించి వెంటనే ఆ స్థలం ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహశీల్దారు ఏ శివరామ సుబ్బయ్యను ఆదేశించారు. రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ భూమిగా ఉన్న చంద్రగిరి- అనుపల్లి ప్రధాన రహదారిగా అనుకొని ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించకపోతే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. చంద్రగిరి మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సోషల్ మీడియాలో, పత్రికలలో కథనాలు వస్తున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించలేదని, ఎలాంటి చర్యలు తీసుకున్నారు? చెప్పండి..' అని రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్ బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అనంతరం విద్యాధికారులతో పరీక్షల నిర్వహణపై ఆర్‌డివో మాట్లాడుతూ డూప్లికేటు ఎన్‌రోల్‌మెంట్లు లేకుండా చూడాలని, అలా డూప్లికెట్ ఎన్‌రోల్‌మెంట్లు వుంటే డ్రాప్ లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

రహదారి పెండింగ్ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డివో రామ్మోహన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన పిచ్చాటూరు మండ లంలోని మూడియూరు పంచాయ తీ అడవి మిట్ట మలుపు వద్ద బుధవారం చోటు చేసు కుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం మేర కు.. పిచ్చాటూరు నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న కారు శ్రీకాళహస్తి నుంచి పిచ్చాటూరుకు వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకున్నాయి. ద్విచక్ర వాహనంపై ఉన్న శ్రీకాళహస్తి మండలం పానగల్ మిట్టకండ్రిగ గ్రామస్తుడు గణేష్ ఘటన స్థలంలో మృతి చెందాడు. శ్రీ కాళహస్తి చెర్లోపల్లికి చెందిన లక్ష్మయ్య తీవ్ర గాయలు పాటు కావడంతో గ్రామస్థులు 108 సాయంతో పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్ఐ వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదం గురించి మృతుల కుంటుంబ సభ్యలకు తెలియడంతో వారు శోక సంద్రంలో మునిగారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నార్త్ సెక్షారు పరిధిలోని 11 కెవి పాలిటెక్నిక్, వరదరాజ నగర్ పెట్రో ల్ బంక్ ఫీడర్‌లో మరమ్మ తులు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపు దల చేయనుండడంతో బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో 30వ తేది గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆపరేషన్ టౌన్ డివిజన్ ఏపీఎస్పిడిసీఎల్ విద్యుత్ ఈఈ విన్నకోటిచంద్ర శేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా లేని పరిసర ప్రాంతాలు కేటి రోడ్డు, వరదరాజ నగర్, టీటీడీ క్వార్టర్స్ , పరిసర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : బాణాసంచా కాల్చడంతో నిప్పు రవ్వలు పడి పూడి గుడిసెలు అంటుకుని దగ్ధమైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. గూడూరు పట్టణంలోని అశోక్ నగర్‌లో ముసుమూరి రమణయ్యకు చెందిన గుడిసెతో పాటు పక్కనే వున్న ఉన్న రెండు గుడిసెలు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. గూడూరు అగ్ని మాపక అధికారి విజయ్ కుమార్ కథనం మేరకు.. బాణాసంచాకు సంబంధించిన నిప్పు రవ్వల వల్ల అగ్ని ప్రమాదానికి గురై గుడిసెలు కాలి పోయాయన్నారు. ఈ ప్రమాదం కారణంగా ఒక లక్ష రూపాయలు మేరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. చుట్టు పక్కల వారు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండల సాధారణ సర్వసభ సమావేశం గురువారం ఉదయం 10.30. గంటలకు పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షులు మునివేలమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడివో రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ నంబర్లు, మండల వివిధ శాఖాధికారులు రానున్నారన్నారు. సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలు అజెండాగా వుంటుందని వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంరక్షణ, రెవెన్యూకు సంబంధించిన సమస్యలు, గృహ నిర్మాణం తాగునీటి సమస్య విద్యుత్ శాఖ, విద్యాశాఖకు సంబంధించిన, ఆర్‌అండ్‌బి, శిశు సంక్షేమ శాఖ, అటవీ శాఖ, రోడ్డు భవనాలు, శాఖ సాంఘిక సంక్షేమం, వైద్యం, నీటి పారుదల శాఖ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

నివేదితకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో బయోకెమిస్ట్రీ విభాగం పరిశోధకు రాలు డి నివేదితకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సిఈ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఎస్‌పిఎంవివిలో అప్లైడ్ మైక్రో బయాలజీ ఆచార్య పి ఉమామహేశ్వరిదేవి, ఎస్వీయూ బయోకెమిస్ట్రీ ఆచార్య సి సురేష్ కుమార్ పర్యవేక్షణలో 'ఇన్వెస్టిగేషన్ ఆన్ ది యాంటి డయాబెటిక్ అండ్ యాంటి ఆక్సిడంట్ ఆఫ్ అండ్రోగ్రాఫిస్ స్పీషీస్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు.

విజేతలకు జ్ఞాపికలు బహూకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్‌లోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూలులో స్పోర్ట్స్ మీట్ 2క25 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 11 రకాల ఆటల పోటీల విజేతలకు జ్ఞాపికలు, మెడల్‌లు, 200 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులకు అందించారు. ముఖ్య అతిథి ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లడుతూ ఆటల వల్ల ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చు కోవచ్చని చదువుతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ యం శివకుమార్ రెడ్డి, పీడీ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు , తల్లి దండ్రులు పాల్గొన్నారు .

మెరుగైన సేవలు అందించాలి

జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా టాస్క్ ఫోర్సు అధికారి డాక్టరు శ్రీనివాసులు వైద్యులను ఆదేశించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు మండలంలోని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందిం చాలని ఆదేశించారు. గ్రామంలోని గర్భిణు లకు వైద్య పరీక్షలు చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు వివరించారు. తీసు కోవాల్సిన జాగ్రత్తలపై అవగాహ న కల్పించారు. అనంత రం , పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం వారి గా వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ జ్యోతి నాగేంద్ర కుమార్ , నరేష్ బాబు, ప్రకాష్, సూపరు వైజరు వంస్తానయ్య, నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శిస్తున్న జిల్లా టాస్క్ ఫోర్సు అధికారి డాక్టరు శ్రీనివాసులు

మౌలిక వసతుల కల్పనకు కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ క్రమంలో ఈ ప్రాంతంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు . గూడూరు శివారు ప్రాంతమైన చవట గిరిజన కాలనీలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. చవట గిరిజన కాలనీలో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారుల హాజరుతో నిర్వహించిన గ్రామ సభలో స్థానికులు వారి వ్యక్తిగత, మౌలిక వసతులపై పలు అర్జీలను ఎమ్మెల్యే, అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని గ్రామసభ నిర్వహిస్తామని ప్రజలు సభ దృష్టికి సమస్యలు తీసుకొచ్చి ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అన్యాక్రాంతమై ఉన్న పేదల భూములను విడిపించి తిరిగి వారికి అందించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహశీల్దారు చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు , ఎంపిడివో మధుసూదన్ రావు , అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

IN THE COURT OF THE V ADDITIONAL DISTRICT JUDGE: TIRUPATI
O.S.No. 312 / 2018
B. Subhash Chand Jain and another ...Plaintiffs
V/s
M. Siddaiah (died) and others ...Defendants
NOTICE TO DEFENDANTS 3 TO 5
D3. M. Neelavathi wife of late M. Siddalah
D4. M. Sridhar Babu son of late M. Siddalah
D5. M. Manjula wife of K. Sreenivasulu
Nos.3 to 5 are residing at 19-12-655, Bairagipatteda, Tirupati Town and Urban Mandal, Tirupati District, presently residing at C/o Manjula, D.No.6-26, 2nd Floor, near Kesavayanagunta water tank, Sainagar, Tirupati.
Please take notice that the plaintiffs filed the above suit for specific performance of contract and the same is posted to 05.02.2025 for your appearance either in person or through your advocate, failing which the matter will be decided exparte.
(By the order of the court)
Hearing Date: 05.02.2025 at 10:30 A.M.
GALI SREENIVASULU
Advocate for Plaintiffs, Tirupati

మందుల పిచికారితో మామిడిలో ఒకేసారి పూత

మండల ఉద్యానశాఖాధికారి పి శివకుమారి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: మామిడిలో అంతా ఒకేసారి పూతరావాలంటే మందు పిచికారీ చేయాలని మండల ఉద్యానశాఖాధికారి పి శివకుమారి రైతులకు సూచించారు. బుధవారం భాకరాపేట, తవ్వావాండ్లపల్లి, గోటూరువాండ్లపల్లి, అరికెల వాండ్లపల్లి మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం మామిడిలో పూత వస్తోందని, ఈపూత ఒకేసారి మొత్తం రావడానికి ఒక లీటరు నీటికి 10 గ్రాముల మల్టీకే (13:00:45) , 1 గ్రాము ఫార్ములా-4 కలిపి పిచికారి చేయాలన్నారు. తరువాత పూత నుండి కాయ కోసే వరకు రకరకాల చీడ పీడలు ఆశిస్తాయని, అందులో తేనె మంచు పురుగు అతి ముఖ్యమైందని, దీని నివారణకు బుఫ్రో ఫెజిన్-1 నుండి 2మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆంత్రక్నోస్ మచ్చ తెగులు నివారణకు, తామర పురుగు నివారణకు, టెంక పురుగు నివారణకు, పండు ఈగ నివారణకు వాడాల్సిన మందు లను వివరించారు. పూత, పిందెలు రాల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిందె దశ నుండి కాయ నాణ్యత, పరిమాణం పెంపునకు వాడాల్సిన మందులను వివరించారు. వివిధ దశల్లో మామిడి కాయలు పెద్దవి అయ్యేందుకు తీసుకోవాల్సిన మందులు, జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎ రామక్రిష్ణారెడ్డి, గోటూరు రాధమ్మ, బొడ్డు చెంగలరాయులు, సిబ్బంది, పూర్ణిమ పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పురపాలక మున్సిపల్ వీధి విక్రయదారుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడను వీధి విక్రయ దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్ శివకుమార్. వీధి వ్యాపారుల సంఘం పుత్తూరు గౌరవ అధ్యక్షులు డి మహేష్ ఆధ్వర్యంలోబుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత రంగ వీధి వ్యాపారు లను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, వ్యాపార లైసెన్సులు అందించడంతో పాటు వారికి మౌలిక సదుపాయాలు అందించాలని సుప్రీం కోర్టు ఆజ్ఞాపించిందని దీనిపై కేంద్రం చట్టం చేసిందని, ఈ నిబంధనలు అమలు చేయాలని కోరారు. బీమా సౌకర్యం, శిక్షణ, ఇతర సామాజిక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వ సహకారంతో అందించాలన్నారు. వీధి వ్యాపారుల వద్ద గేట్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి వ్యాపారులకు మున్సిపల్, పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారుల సంఘం పుత్తూరు పట్టణ అధ్యక్షులు నజీర్ బాయ్, కార్యదర్శి నవీన్, నాయకులు చాంద్ బాషా, కాశి, రాము, రఫీ ,పాల్గొన్నారు.

పాకాల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)
O.S No.14/2024
యం.వెంకటాద్రి నాయుడు ...వాది
చెవుల శ్రీధర్ ...ప్రతివాదులు
ప్రతివాదికి కోర్టు నోటీసు
To
చెవుల శ్రీధర్ తండ్రి సి.పాండురంగ, డోర్‌నెం. 15-151, న్యూ కాలనీ, పాకాల, తిరుపతి జిల్లా.
ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై దావా వాది నీ నుండి రావలసిన ప్రొనోటు డబ్బు వసూలుకు వేసి యున్నాడు. 07.02.2025వ తేది పై కోర్టు నందు ఉదయం 10:30 గం॥లకు హాజరై ఆక్షేపణలు తెలుకొనవలెయును. లేని యెడల మీ పరోక్షమున తీర్పు మీకు వ్యతిరేకముగా నిర్ణయించబడును.
ఇట్లు
జి. గురుస్వామి నాయుడు
వాదితరపు న్యాయవాది